క్లుప్తంగా

స్వచ్ఛమైన నీటితోనే ఆరోగ్యం

పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి



హాస్టళ్లలో వాటర్ పిల్లర్లను ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: స్వచ్ఛమైన నీటితోనే విద్యార్థులకు ఆరోగ్యం లభిస్తోందని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల, బీసీ వసతి గృహాలకు వాటర్ పిల్లర్లను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో నీరు కలుషితమవుతోందని, అందువల్ల వసతి గృహాల్లో వాటర్ ఫిల్టర్ మిషన్‌లను బిగించినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు సమత, నాయకులు సున్నపు వసంతం,శ్రీకాంత్‌రెడ్డి, మధుసుధన్‌గుప్తా పాల్గొన్నారు.

అమ్మానాన్నలతో ఆనందంగా..



తల్లిదండ్రులతో పిల్లలు

మొయినాబాద్: తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో చదివే పిల్లలు సెలవులు ఎప్పుడొస్తాయో.. అమ్మానాన్నలు ఎప్పుడొస్తారో అని ఎదురుచూస్తుంటారు. సెలవు వచ్చిందంటే చాలు హాస్టల్ పరిసరాలు పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలకలలాడుతుంటాయి. రెండో శనివారం సెలవు కావడంతో శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చదివే తమ పిల్లలను చూడటానికి తల్లిదండ్రులు వచ్చారు. పిల్లలు బయటకు వచ్చి మండల తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో తల్లిదండ్రులతో కలిసి ఆనందంగా గడిపారు. తల్లిదండ్రులు తెచ్చిన తినుబండారాలను ఆరగించారు. కొందరు తల్లులు పిల్లలకు తల దువ్వి జడలు వేశారు. శనివారం సాయంత్రం ఆ ప్రాంతమంతా తల్లిదండ్రులతో పిల్లల కోలాహలం కనిపించింది.

మట్టితో మాణిక్యాలు తయారు చేయొచ్చు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న మాజీ వైస్ చాన్స్‌లర్ పద్మావతి

మొయినాబాద్ రూరల్: మట్టితో వివిధ కళారూపాలు, పాత్రలు, విగ్రహాలను తయారు చేయడంలో నైపుణ్యత సాధించాలని హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ హార్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పద్మావతి అన్నారు. శనివారం అమ్మాపూర్‌లోని జేబీఆర్ హార్కిటెక్చర్ కళాశాలలో రాష్ట్రస్థాయిలో మట్టి నైపుణ్యాలపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్టితో తయారు కళాకృతులను ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ మట్టితో వివిధ కళారూపాలు తయారు చేయడంలో నైపుణ్యం కలిగినప్పుడే ఆకర్షణీయంగా తయారు చేయగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గాయత్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఎంతో వైభవంగా భక్తి శ్రద్ధలతో పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పట్టణానికి చెందిన బోజ్యానాయక్, అలివేలు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వసంతరావు, రఘుగౌడ్, రమేష్, కృష్ణచారి, శంకర్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ కోసం పరుగులు

ధ్రువపత్రాలు లేకుండానే దరఖాస్తు

- సెలవురోజు కూడా అర్జీల స్వీకరణ
- గడువు పెంచాలంటున్న లబ్ధిదారులు



గృహలక్ష్మి దరఖాస్తు ఫారం నింపుతున్న మహిళ

మొయినాబాద్: సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదలకు ఆసరాగా నిలిచి వారి సొంతగూటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట ప్రభుత్వ ఉద్దేశం మంచిదే. కానీ దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ సమయం ఉండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. శనివారమే చివరి రోజు కావడంతో చాలా మంది ఉరుకులు, పరుగులతో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫారానికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేయాలని అధికారులు సూచించినా.. చాలా మంది అవి లేకుండానే దరఖాస్తు చేసుకున్నారు. మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులు అందజేశారు. రెండో శనివారం సెలవు అయినా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు తీసుకున్నారు. మండల వ్యాప్తంగా 700 వరకు దరఖాస్తులు వచ్చాయని, కులం, ఆదాయం సర్టిఫికెట్లు లేకుండానే దరఖాస్తు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు తీసుకోవడానికి కనీసం వారం రోజుల సమయం పడుతుందని, వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రావడంతో అధికారులు అందుబాటులో లేరని, అర్హులు చెబుతున్నారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండానే దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ మూడు రోజులే గడువు ఇవ్వటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వారం రోజులపాటు గడువు పొడిగించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భారీగా దరఖాస్తులు

కొందుర్గు: గృహలక్ష్మి పథకం కోసం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో భారీగా దరఖాస్తులు అందాయి. కొందుర్గు మండలంలోని 22 గ్రామపంచాయతీలకు సంబంధించి 1361 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సంబంధించి 1669 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. వారం రోజుల్లో గ్రామాల్లో విచారణ జరిపి అర్హులను గుర్తించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- కేసీఆర్ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి
- ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ్మారెడ్డి

మొయినాబాద్ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి హెచ్చరించారు. తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కోర్టులో అనుమతి రావడంతో కేసీఆర్ చిత్రపటాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు క్షీరాభిషేకం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మాజీ సీఎం వైయస్సార్ రంగారెడ్డి జిల్లాకు తాగు, సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో అంబేడ్కర్ చేవెళ్ల ప్రాణహిత అనే పేరుతో అప్పట్లో ఈ ప్రాజెక్టుకు నామకరణం చేసి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని 84 గ్రామాల్లో గుదిబండగా ఉన్న 111 జీవో ఎత్తివేసి సంబరాలు జరుపుకోవడం బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలకుగాను ఏడు స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల కాంగ్రెస్ నాయకుడు షాబాద్ దర్శన్, జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాణయ్య, చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు వసంతం తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, షాబాద్ డాక్టర్ స్రవంతి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్, మన్‌మర్రి గ్రామాలల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స కాలంలో పశువులకు రైతులు టీకాలు వేయించాలని సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏడాదిలో రెండు విడతలు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నారని తెలిపారు. పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నందిగామ: అనారోగ్యాలకు గురవుతున్న పశువుల ఆరోగ్యం పట్ల అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ గోవిందు అశోక్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో మండల పశు వైద్య బృందం ఆధ్వర్యంలో శనివారం పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఏ మాత్రం అనారోగ్యాలకు గురైనట్లయితే వెంటనే సమీపంలోని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లాలని, పశువైద్యులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ విష్ణువర్ధన్, ఉప సర్పంచ్ శేఖర్, పశు వైద్య సిబ్బంది గోపాల్, గ్రామస్తులు యాదయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలి

కొత్తూరు: మండలంలోని మల్లాపూర్ నుంచి గూడూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో మల్లాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినాఏలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

చర్యలేవి?

కొత్తూరు: పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లపై ప్రమాదకర మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులను గుర్తించి కనీస రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. తిమ్మాపూర్ నుంచి తాళ్లగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న ఓ మూల మలుపు వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రోడ్డు ఎస్ ఆకారంలో ఉండడంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



రక్షణలేని కల్వర్టు

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేదు

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



వృద్ధురాలితో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్ పాలకులు, అధికారులకు పన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనర్సింహ్మ కాలనీలో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ కాలనీలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల పన్ను వసూలు చేస్తున్న పాలకులు, అధికారులు సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీకి అనేక అవార్డులు వస్తున్నాయని చెబుతున్న అధికారులకు ప్రజల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకుంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య యాదవ్, బాబర్ అలీఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్, శ్రీధర్, , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



బీజేపీ మహాధర్నాకు వెళ్లిన మండల నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని తొమ్మిదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నేరవేర్చలేదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తలపెట్టిన మహాధర్నాకు చేవెళ్ల మండలం నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టి ఇస్తామని ఆశ చూపించి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఇప్పుడు గృహలక్ష్మి పథకం అంటూ నమ్మించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మహాధర్నాకు వెళ్లిన వారిలో బీజేపీ మండల కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, మధుసుధన్‌రెడ్డి, శర్వలింగం తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో పాలు పంచుకోండి

హైదరాబాద్ జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ నర్సింహ్మారెడ్డి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ నర్సింహ్మారెడ్డి

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు, యువత సమాజ సేవలో పాలు పంచుకోవాలని హైదరాబాద్ జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్ట నర్సింహ్మారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని జేబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పట్టభద్రుల పట్టాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధి చెందడానికి కావాల్సిన సూత్రాలను పాటిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలిపారు. ఉన్నత స్థానాల్లో ఉన్నా సమాజ సేవ కోసం కృషి చేయాలని సూచించారు. జేబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ జేబీఐటీ కళాశాలలో 12వ పట్టభద్రుల దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ హబ్ సీఈవో శ్రీనివాస్‌రావు, డీఓజీ చైర్మన్ కోలకలూరి ఇనాక్, ప్రిన్సిపల్ కృష్ణమాచారి, అడ్మిన్ సీఈవో రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



నర్సింహులు (ఫైల్)

నందిగామ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. శ్రీనివాసులు గూడ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు(32) ఈ నెల 4వ తేదీన ఉదయం 8 గంటలకు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ రోజు రాత్రి అయినా ఇంటికి రాలేక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లి మూడు నాలుగు రోజులకు తిరిగి వచ్చావాడని.. కానీ వారం రోజులైనా రాక పోవడంతో నర్సింహులు భార్య సంతోష పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాలకృష్ణ తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని ఈడెన్ ప్లాజా ఫంక్షన్ హాలులో ఖైరుల్ మోమినీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాధితులను ఆదుకోవాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు.

పాఠశాలలను అభివృద్ధి చేయాలి

కొత్తూరు: మండలంలో కొనసాగుతున్న ఉర్దూ మీడియం పాఠశాలలను అభివృద్ధి చేయాలని మైనార్టీ సంఘం నాయకుడు లతీఫ్ విద్యాశాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలకు సొంత భవనాలు, తగినంత బోధన సిబ్బంది లేరని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉర్దూ మీడియం పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

గ్రామ కమిటీ ఏర్పాటు

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎస్సీ సెల్ మండల కమిటీ అధ్యక్షుడు నరేందర్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడుగా మహేశ్, ఉపాధ్యక్షుడుగా చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా సందీప్, సహాయ కార్యదర్శిగా నవీన్ ఎన్నికైనట్లు తెలిపారు.

శాంతి సమాజ స్థాపనకు కృషి

షాద్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించి శాంతి సమాజ స్థాపనకు కృషి చేయాలని ప్రొఫెసర్ రెవ. సునీల్ డేనియల్ అన్నారు. పట్టణంలోని జియోన్ ఎంబీ చర్చిలో శనివారం విజినరీ ఆఫ్ గ్లోబుల్ కోర్స్ ఇన్‌స్ట్రక్టర్ ఇమినెటెడ్ బైబిల్ స్కాలర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బైబిల్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఏసును నమ్ముకున్న వారికి ఎల్లవేళలా తోడుగా ఉంటాడని అన్నారు. సంఘ కాపరి రెవ.కృష్ణపాల్, జియోన్ ఎంబీ చర్చి చైర్మన్ జ్ఞానప్రకాష్, వైస్ చైర్మెన్ బిల్లీగ్రాహమ్, కార్యదర్శి జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొందుర్గు: హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. కొందుర్గు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రేగడిచిల్కమర్రి గ్రామానికి చెందిన కోడుగంటి కుమార్ (35) కడుపునొప్పి భరించలేక శుక్రవారం పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు చికిత్స కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుమార్ మృతి చెందాడు. మృతుడి భార్య సరిత శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అభ్యున్నతే ప్రభుత్వం ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం మండలం లోని ప్రొద్దటూరు గ్రామంలో గొల్ల కురుమలకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని కులవృత్తులను ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, ఎంపీటీసీ ప్రవల్లిక, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాపారావు, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి

చేవెళ్ల: జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కో ఆర్డినేటర్ శైలజ ఆగిరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా కో ఆర్డినేటర్‌గా ఎంపికైన శైలజను ఆ పార్టీ నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించిందన్నారు. చట్టం ప్రకారం పంచాయతీరాజ్‌కు రావాల్సిన నిధులు ప్రభుత్వం నుంచి గ్రామాలకు వచ్చేలా పనిచేస్తానని చెప్పారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని బాలికల కళాశాల వసతి గృహంలో శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్‌చౌహాన్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్య పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందని అన్నారు. సమస్యల పరిష్కారంకోసం విద్యార్థి లోకాన్ని ఏకంచేసి ఉద్యమాలను చేపట్టిన ఘనత ఏఐఎస్ఎఫ్‌కు దక్కుతుందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాష్నాయక్, విజయ్‌చారి, సాయి, ప్రకాష్, మల్లేష్, రాహుల్, మోహన్, ప్రేమ్‌కుమార్, సుమ, అంకిత, సవిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ నియోజకవర్గాలను గెలిపించుకుందాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మొయినాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 19 ఎస్సీ నియోజకవర్గాలను గెలిపించుకునేందుకు.. అందరూ పనిచేయాలని మాజీ మంత్రి విజయరామారావు, మాజీ పార్లమెంట్ సభ్యుడు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలో జితేందర్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన చేవెళ్ల నియోజకవర్గ నేతలతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, నాయకులు కంజర్ల ప్రకాష్, ప్రభాకర్‌రెడ్డి, రవి, సురేష్, నర్సింహ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

మొయినాబాద్: ఉరివేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ముర్తుజాగూడలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముర్తుజాగూడ గ్రామానికి చెందిన చంద్రకళ (40) భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు. వారి పెళ్లిళ్లు అయ్యాయి. చంద్రకళ కూలిపనికి వెళ్లేది. శనివారం కూడా పనికి వెళ్లి తిరిగి వచ్చింది. రాత్రి 7 గంటల సమయంలో వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.